క్లుప్తంగా

విరబూసిన మామిడి పూత



బీఎన్‌కండ్రిగలో విరబూసిన పూత

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని మామిడి తోటల్లో పూత విర బూసింది. మండలంలో 450 ఎకరాల విస్తీర్ణంలో మామిడి తోటలు ఉన్నాయి. ఈ సంవత్సరం భారీవర్షాలు కురవడంతో పూత బాగా వచ్చింది. పూత విరబూయడంతో కాపు బాగా వస్తుందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మామిడి పూత దెబ్బ తినకుండా వివిధ రకాల మందులను పిచికారీ చేస్తున్నారు.

రావి, వేపచెట్లకు కల్యాణం



అన్నదానం చేస్తున్న వాసుదేవ నాయుడు

తొట్టంబేడు(శ్రీకాళహస్తి రూరల్): మండలంలోని పాయ్య గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఉన్న రావి వేప చెట్లకు ఎంపీపీ ఉన్నం నిర్మల, ఆమె భర్త వాసుదేవనాయుడు ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా కల్యాణోత్సవం చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

తొండమాన్‌పురంలో నేటి నుంచి బ్రహ్మోత్సవాలు



శ్రీకాళహస్తి రూరల్: మండలంలోని తొండమాన్‌పురం గ్రామంలో వెలసి ఉన్న టీటీడీ అనుబంధాలయమైన శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో ఈ నెల 19 నుంచి మార్చి 01వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఈ నెల 19న ఆదివారం అంకురార్పణ, 20న సోమవారం ధ్వజారోహణం, శేషవాహనం, 21న మంగళవారం హంసవాహనం, 22న బుధవారం సింహవాహనం, 23న గురువారం హనుమంత వాహనం, 24న శుక్రవారం కళ్యాణోత్సవం, గరుడవాహనం, 25న శనివారం గజవాహనం, 26న ఆదివారం చంద్రప్రభవాహనం, 27న సోమవారం రథోత్సవం, అశ్వవాహనం, 28న మంగళవారం చక్రస్నానం, ధ్వజావరోహణము, మార్చి 01న పుష్పయాగం కార్యక్రమాలు ఉంటాయని అధికారులు తెలిపారు.

నదిలో పిండ ప్రదానాలు



పిండ ప్రదానాలు చేస్తున్న భక్తులు

శ్రీకాళహస్తి: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు శ్రీకాళహస్తికి వచ్చిన భక్తులు ఎక్కువ మంది స్వర్ణముఖి నదిలో స్నానం చేసి ఆలయానికి వెళ్లారు. నవంబరు, డిసెంబరు నెలల్లో కురిసిన వర్షాల వల్ల నదిలో నీళ్లు పారుతున్నాయి. భక్తులు పుణ్యస్నానాలు చేసి స్వామి, అమ్మవార్ల దర్శనానికి వెళ్లారు.అలాగే ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్నానఘట్టాల వద్ద స్నానాలు చేసిన మహిళలు దుస్తులు వేసుకునేందుకు వీలుగా అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. దీనివల్ల మహిళలు ఇబ్బందులు పడలేదు. అంతేకాకుండా మరికొందరు చనిపోయిన కుటుంబ సభ్యులకు స్వర్ణముఖినది సమీపంలో పిండ ప్రదానాలను చేశారు.

రాష్ట్రీయ బాలపురస్కార్ గ్రహీతకు సన్మానం



గౌరవిరెడ్డిని సత్కరిస్తున్న కలెక్టర్

రేణిగుంట: ప్రధాన మంత్రి రాష్ట్రీయ్ బాల పురస్కార్ అందుకున్న మిద్దె గౌరవిరెడ్డిని శనివారం రాత్రి కలెక్టర్ వెంకటరమణారెడ్డి సత్కరించారు. మండలంలోని గాజులమండ్యం మూలస్థానేశ్వరాలయాన్ని ఆయన కుటుంబ సమేతంగా కలసి దర్శించుకున్నారు. నాట్యకళలో అత్యంత ప్రతిభ కనబరిచినందుకు ఆమెకు ఈ ఏడాది ప్రధాన మంత్రి రాష్ట్రీయ్ బాల పురస్కార్ అవార్డును గత నెలలో రాష్ట్రపతి చేతుల మీదుగా అందుకుంది. దీంతో గాజులమండ్యంకు విచ్చేసిన మిద్దె గౌరవిరెడ్డిని ఆయన పూలమాలలు, శాలువతో ఘనంగా సత్కరించి జ్ఞాపికను బహూకరించారు.

శివ శివ శంకర..

ముక్కంటి క్షేత్రంలో బ్రహ్మోత్సవ సంబరం

- ఘనంగా మహాశివరాత్రి వేడుకలు
- మార్మోగిన శివనామ స్మరణ
- కిటకిటలాడిన శైవక్షేత్రాలు



శ్రీకాళహస్తి: నంది వాహనసేవకు తరలివచ్చిన అశేష భక్తజనం

రేణిగుంట: శివరాత్రి పర్వదినాన నియోజకవర్గంలోని శివాలయాలు భక్తకోటితో కిటకిటలాడాయి. ముక్కంటీశుని క్షేత్రం శ్రీకాళహస్తిలో బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. రేణిగుంట మండలంలోని గాజులమండ్యం కామాక్షిదేవి సమేత మూలస్థానేశ్వరాలయంలో శనివారం ఉదయం నుంచి భక్తులు బారులుతీరి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ నిర్వాహకుడు జువ్వల ధనంజయ రెడ్డి నేతృత్వంలో ఆలయాన్ని పూలు, పండ్లతో విశేషంగా అలంకరించారు. ఆలయ ప్రాంగణమంతా చలువ పందిళ్లు, అరటి తోరణాలతో ముస్తాబు చేశారు. స్వామి,అమ్మవార్ల కల్యాణ మహోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. మహిళలు విశేష సంఖ్యలో పాల్గొని, పసుపు దారాలు, తీర్థప్రసాదాలను అందుకున్నారు. అనంతరం వేలాది మంది భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం నంది వాహనంలో ఉత్సవ మూర్తుల ఊరేగింపు మేళ,తాళాల మధ్య వేడుకగా జరిగింది. కలెక్టర్ వెంకటరమణారెడ్డి, పలువురు ప్రముఖులు స్వామి,అమ్మవార్లను దర్శించుకున్నారు.

అత్తూరులో..

మండలంలోని అత్తూరులో స్వయంభువుగా వెలసిన నీలకంఠేశ్వరాలయంలో శివరాత్రి వేడుకలు ఘనంగా జరిగాయి. ఎంపీపీ హరిప్రసాద్‌రెడ్డి, సర్పంచ్ ప్రసాద్ తదితరులు దర్శించుకున్నారు. వెదుళ్లచెరువులో వెలసిన ఓంకార జ్యోతిర్లింగేశ్వరాలయంలో విశేష పూజలు జరిగాయి. అన్నదానం చేశారు. రేణిగుంట వేణుగోపాలపురంలోని శివాలయంలో, రేణిగుంట బుగ్గవీధిలోని నందీశ్వరాలయంలో విశేష పూజలు చేశారు.

ఆకట్టుకున్న భరత నాట్యం

శ్రీకాళహస్తి రూరల్: శ్రీకాళహస్తీశ్వరుని బ్రహ్మోత్సవాల్లో భాగంగా దూర్జటి కళా ప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. శనివారం రాత్రి కళాకారులు ప్రదర్శించిన నృత్యాలు, భక్తి రంజని కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. శ్రీకాళహస్తికి చెందిన హర్షితా సూర్యకుమార్, మనస్విని భరతనాట్యం భక్తులను ఆకట్టుకుంది. పుత్తూరుకు చెందిన రవిభాగవతార్ హరికథ భక్తులను రంజింపచేసింది. తిరుపతికి చెందిన విజయలక్ష్మి, శ్రీకాళహస్తికి చెందిన సుబ్రమణ్యం, చంద్రరావు భక్తి రంజని కార్యక్రమం భక్తులను ఆకట్టుకుంది. కుప్పంకు చెందిన కల్పనాదేవి, శ్రీకాళహస్తికి చెందిన శ్రీవిద్య, ధనుష్క, ఓధనసారా, హర్షితా సూర్యకుమార్, రసజ్ఞ, సన్నిహిత, పుత్తూరుకి చెందిన బాలాజీ, హైదరాబాద్‌కు చెందిన నిర్మలా నాగేశ్వరరావు నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ముచ్చివోలుకి చెందిన శ్రీరామానాట్యమండలి కేతినేని ధర్మానాయుడు వారి ఆధ్వర్యంలో శ్రీకృష్ణరాయబారం, జనార్దన్ ప్రదర్శించిన బాలనాగమ్మ పౌరాణిక నాటిక ప్రదర్శనలు భక్తులను మైమరపింప చేశాయి.

హరహర నామస్మరణ

ఏర్పేడు: మండలంలోని పలు శైవ ఆలయాలు శనివారం మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా భక్తుల శివ నామస్మరణలతో మార్మోగాయి. మండలంలోని గుడిమల్లం పరశురామేశ్వర స్వామి, చిందేపల్లి పార్వతీసమేత సిద్దేశ్వర స్వామి, రావిళ్లవారి కండ్రిగ ఎరికలింగేశ్వర స్వామి, పాపానాయుడుపేట భ్రమరాంబికా సమేత మల్లికార్జున స్వామి, కందాడు సదాశివేశ్వర స్వామి, అంజిమేడు గురప్ప స్వామి, ముసలిపేడు బత్తినయ్య స్వామి, మాధవమాల మల్లికార్జునస్వామి, నాగంపల్లి సిద్దేశ్వర స్వామి, ఏర్పేడు నీలకంఠ స్వామి తదితర ఆలయాల్లో శివలింగాలకు ఉదయం నుంచి పలు రకాల అభిషేకాలతో పూజలు చేశారు. పలు ప్రాంతాల నుంచి ఆలయాలకు వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయాల్లో మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.. పాపానాయుడుపేటలో వరసిద్ధి వినాయక ఆటో యూనియన్ నాయకులు భక్తులకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు.

గుడిమల్లంలో కలెక్టర్

ఏర్పేడు: మండలంలోని గుడిమల్లం పరశురామేశ్వర స్వామి ఆలయంలో కలెక్టర్ వెంకటరమణారెడ్డి పూజలు చేశారు. ఆలయంలో అర్చనలు, పూజలు నిర్వహించారు. ఆలయ విశిష్టతను అడిగి తెలుసుకున్నారు. వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి, పరశురామేశ్వర స్వామి, ఎరికలింగేశ్వర స్వామి, చిందేపల్లి సిద్దేశ్వర స్వామి ఆలయాల చైర్మెన్‌లు నరసింహ యాదవ్, రాజశేఖర్, గిరిధర్‌రెడ్డి, ఈఓ రామచంద్రారెడ్డి, జెడ్పీటీసీ తిరుమలయ్య, వైస్ ఎంపీపీలు శ్రీనివాసులు, జనార్ధన్‌రెడ్డి, సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు నాగార్జునరెడ్డి, పలువురు ప్రముఖులు ఆలయంలో పూజలు నిర్వహించారు.

తొట్టంబేడు మండలంలో..

తొట్టంబేడు(శ్రీకాళహస్తి రూరల్): శివరాత్రి వేడుకలను మండలంలో శనివారం ఘనంగా నిర్వహించుకున్నారు. పెద్దకన్నలిలోని అగస్తీశ్వరాలయం, తొట్టంబేడులోని శివాలయం, పూడికి సమీపంలోని అర్ధనారీశ్వరాలయం, సింగమాలలో వీరభద్రుని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం పలు ఆలయాల వద్ద జాగరణ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అగస్తీశ్వరాలయంలో శనివారం రాత్రి లింగోద్భవ దర్శనం నిర్వహించారు. దీనికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ ధర్మకర్త ఆధ్వర్యంలో అర్చకులు అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల రద్దీకి తగినట్లు ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

పరశురామేశ్వర స్వామికి పట్టు వస్త్రాలు



ఏర్పేడు: మండలంలోని గుడిమల్లం పరశురామేశ్వర స్వామి ఆలయానికి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి తనయుడు బియ్యపు ఆకర్ష్ రెడ్డి, కుమార్తె బియ్యపు పవిత్రారెడ్డి శనివారం సాయంత్రం పట్టు వస్త్రాలను సమర్పించారు. అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం అర్చనలు, పూజలు నిర్వహించారు. స్వామివారి చిత్రపటం, తీర్థ, ప్రసాదాలను వారికి అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి, పరశురామేశ్వర స్వామి ఆలయ చైర్మన్ నరసింహ యాదవ్, ఈఓ రామచంద్రారెడ్డి, సర్పంచ్ సుబ్రమణ్యం, వైఎస్సార్ సీపీ నాయకులు దినేష్ యాదవ్, రమణయ్య యాదవ్, రాజశేఖర్‌రెడ్డి, సాయి, సంతోష్, గురునాథం, మునిరత్నంరెడ్డి మునికృష్ణారెడ్డి, కుమార్‌రెడ్డి, దామోదరంరెడ్డి పాల్గొన్నారు.








విశేషాలంకరణలో ఎరికలింగేశ్వర స్వామి, సిద్ధేశ్వర స్వామి, అత్తూరులోని నీలకంఠేశ్వరుడు, బత్తినయ్య స్వామి, గుడిమల్లంలో పట్టు వస్త్రాలను సమర్పిస్తున్న బియ్యపు ఆకర్ష్‌రెడ్డి, బియ్యపు పవిత్రారెడ్డి, గాజులమండ్యంలో విశేష అలంకరణలో మూలస్థానేశ్వరుడు

సురుటపల్లిలో శివ వైభవం



సురుటపల్లెలో నందీశ్వరునికి మహాభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

పిచ్చాటూరు: సురుటపల్లెలోని ప్రముఖ శ్రీమంగళాదేవి సమేత పళ్లికొండేశ్వరాలయం శనివారం మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తులతో పోటెత్తింది. శ్రీవాల్మీకేశ్వర స్వామి, మరగదాంబిగ అమ్మవారు, మంగళాదేవి సమేత శ్రీపళ్లికొండేశ్వర స్వామివార్లకు ప్రత్యేక అభిషేక పూజలు, అలంకరణలు చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఉదయం కలెక్టర్ వెంకటరమణ రెడ్డి, డీఆర్‌ఓ శ్రీనివాసరావు పూజల్లో పాల్గొన్నారు. మధ్యాహ్నం టీటీడీ చైర్మన్ సతీమణి స్వర్ణలత, ఏఈఓ శ్రీపతి, ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పట్టు వస్త్రాలను సమర్పించారు.

వృషభ వాహనంపై విహారం

సాయంత్రం పార్వతీ, పరమేశ్వరుల ఉత్సవ మూర్తులను విశేషంగా అలంకరించి వృషభ వాహన సేవ నిర్వహించారు. ముందు కోలాట ప్రదర్శనలు సాగుతుండగా మంగళవాయిద్యాలు నడుమ వాహన సేవ కనులపండుగగా సాగింది. ఉభయదారులుగా ఆలయ చైర్మన్ ఏవీయం మునిశేఖర్ రెడ్డి, కుటుంబ సభ్యులు వ్యవహరించారు.

ఘనంగా శని మహా ప్రదోష పూజలు

సాయంత్రం నందీశ్వరునికి శని మహా ప్రదోష పూజలు ఘనంగా నిర్వహించారు. వివిధ రకాల సుగంధ ద్రవ్యాలతో అభిషేకించి, పరిమళభరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించారు. శివపార్వతుల ఉత్సవమూర్తులకు ఆలయ ప్రాకారోత్సవం నిర్వహించారు. ఉభయదారులుగా శ్రీసిటీ ఎండీ రవిసన్నారెడ్డి, ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పాల్గొన్నారు. శివరాత్రి, శని త్రయోదశి ఒకే రోజు రావడంతో ప్రదోష పూజలకు భక్తులు పోటెత్తారు. ఆలయ చైర్మన్ ఏవీయం బాలాజీ రెడ్డి, సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.




శని ప్రదోష పూజల్లో ఎమ్మెల్యే ఆదిమూలం, నంది సేవలో శ్రీసిటీ ఎండీ రవిసన్నా రెడ్డి, కలెక్టర్ వెంకటరమణ రెడ్డి

బాల్యా వివాహాల నిర్మూలనపై ర్యాలీ




తొట్టంబేడు(శ్రీకాళహస్తి రూరల్): జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో శనివారం మండలంలోని గుండెల గుంట ఎస్టీ కాలనీలో బాల్య వివాహాల నిర్మూలనపై ర్యాలీ, అవగాహన సదస్సు నిర్వహించారు. శ్రీకాళహస్తి డివిజన్ కార్యదర్శి బి చెంచయ్య, గౌరవ సలహాదారులు షరీఫ్ ఆధ్వర్యంలో తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. చిన్న వయసులోని బాలికలకు పెళ్లిళ్లు చేయడం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. బాల్య వివాహాల 2006 నిరోధక చట్టం ప్రకారం తల్లిదండ్రులు, పురోహితులు, ఎవరైనా బాల్య వివాహాలను ప్రోత్సహిస్తే వారికి చట్టరీత్యా శిక్ష పడుతుందని తెలియజేశారు.

హరహర మహాదేవ..



వరదయ్యపాళెం : జ్యోతీశ్వరాలయంలో



నారాయణవనం : కైలాసనాథస్వామి,



బీఎన్‌కండ్రిగ: గాజులపెళ్లూరులో..

నారాయణవనం: మహాశివరాత్రిని పురస్కరించుకుని మండలంలోని శైవ క్షేత్రాలు శివనామ స్మరణలతో మార్మోగాయి. పర్యాటక కేంద్రమైన కైలాసనాథకోనలో శ్రీకామాక్షాంబిక సమేత కైలసనాథునికి టీటీడీ తరపున సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పట్టు వస్త్రాలను సమర్పించారు. జలపాతంలో వేకువ జామున నుంచే భక్తులు పవిత్ర స్నానాలు చేసి స్వామి,అమ్మవార్లను దర్శించుకున్నారు. టీటీడీ ఆలయాలైన చంపకవల్లీ సమేత పరాశరేశ్వర, మరగదవల్లీ సమేత అగస్త్యేశ్వర ఆలయాలతో పాటు తుంబూరు తుంబీశ్వరస్వామి, పాలమంగళం పాలీశ్వరస్వామికి వేకువ జామునే అభిషేక పూజలు నిర్వహించారు. కైలాసనాథస్వామిని ఎమ్మెల్యే ఆదిమూలం, జెడ్పీ ఫైనాన్స్ కమిటీ సభ్యుడు సుమన్‌కుమార్, టీటీడీ చైర్మన్ సుబ్బారెడ్డి సతీమణి ప్రేమలతారెడ్డి, ఎంపీపీ దివాకర్‌రెడ్డి దర్శించుకున్నారు. ఆదివారం ఉదయం 11 గంటలకు ఆర్జిత కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. సముదాయంలోని అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో ప్రదోష పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. సాయంత్రం నంది వాహన సేవ వైభవంగా జరిగింది. రాత్రి 12 గంటలకు లింగోద్భవ అభిషేకాన్ని నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

రామగిరికి పోటెత్తిన భక్తులు

పిచ్చాటూరు: మండలంలోని రామగిరి శ్రీమరగదాంబిగ సమేత వాలీశ్వరాలయానికి భక్తులు పోటెత్తారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. అర్చకులు శంకర్ రాజ్ గురుక్కళ్ తీర్థ ప్రసాదాలు అందజేశారు. సాయంత్రం నందివాహన సేవ నిర్వహించారు. సాయంత్రం ఉత్సవానికి ఉభయకర్తలుగా వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఏవీఎం బాలాజీ రెడ్డి, కుటుంబసభ్యులు వ్యవహరించారు.

ఘనంగా జంగమయ్య వేడుకలు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని గాజులపెళ్లూరు, కాంపాళెం, పెద్దపాలేడు శివాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అన్నదానం చేశారు.

మార్మోగిన శివనామస్మరణ

వరదయ్యపాళెం మండలంలోని శ్రీ జ్యోతీశ్వరాలయం, అరుదూరులోని శ్రీకాళహస్తీశ్వర సమేత శ్రీ జ్ఞానప్రసూనాంబికాదేవి ఆలయం, వరదయ్యపాళెంలోని త్రయంబకేశ్వరాలయం, వెంకటరెడ్డికండ్రిగలోని ఉమామహేశ్వర ఆలయం, సంతవేలూరులోని శ్రీకామాక్షిదేవి సమేత వాలీశ్వరస్వామి ఆలయం, ఉబ్బలమడుగులోని సిద్ధేశ్వరాలయం భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం ప్రత్యేక పూజలు, రుద్రాభిషేకాలు జరిగాయి. వరదయ్యపాళెంలోని త్రయంబకేశ్వరాలయంలో స్వామిఅమ్మవార్లకు చేపట్టిన ప్రత్యేక పుష్పాలంకరణలు ఆకట్టుకున్నాయి. అర్చకులు రాజేంద్రప్రసాద్ శర్మ తీర్థప్రసాదాలను అందించారు. ఉబ్బలమడుగు సిద్ధేశ్వరాలయంలో మహాశివరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఏకం వైస్ ప్రెసిడెంట్ లోకేష్ దాసాజీ, సభ్యులు రుద్ర దాసాజీ ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ సర్పంచ్ బొప్పన తిలక్‌బాబు ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. సంతవేలూరు శ్రీ కామాక్షిదేవి సమేత వాలీశ్వరస్వామి ఆలయంలో ధర్మకర్త మాయాని శేఖర్‌రెడ్డి, చెంచులక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో పూజలు జరిగాయి.

భక్తుల రద్దీ



సత్యవేడు: వీరభద్రస్వామి ఆలయంలో ..

సత్యవేడు: పట్టణంలని గాంధీరోడ్డు శ్రీవీరభద్రస్వామి ఆలయంలోని సర్వమంగళదేవి సమేత మృత్యుంజయస్వామి, మహేశ్వరుని దర్శనానికి ఉదయం నుంచి భక్తుల రద్దీ సాగింది. ఉదయం అభిషేక పూజలు, అలంకరణలు జరిగాయి. సాయంత్రం 4గంటలకు నందీశ్వరుని ప్రదోషకాలపూజ, రాత్రి 12 గంటలకు శ్రీ లింగోద్భవపూజ, అభిషేకం నిర్వహించారు.